క్లుప్తంగా

కనులపండువగా బంగారమ్మతల్లి జాతర



మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు హనుమాన్‌సంజీవ్‌కాలనీ కొండ ప్రాంతంలో కొలువుదీరిన బంగారమ్మతల్లి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు,పెద్దలు,ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకు వచ్చి మందిరం వద్ద నెలకొల్పారు. అనంతరం అమ్మవారికి పసుపు,కుంకుమలతో భక్తులు పూజలు చేశారు. సాయంత్రం మందిరం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మహిళలచే కోలాట ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహించారు.భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ వ్యవస్థాపకుడు ఉద్దా భాస్కరరావు అవసరమైన చర్యలు తీసుకున్నారు.

హెచ్‌పీసీఎల్‌కు భారీ యంత్రం రాక



సేవా మార్గంలో భారీ వాహనం

మల్కాపురం: హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ)కి మంగళవారం ఉదయం భారీ యంత్రం వచ్చింది.సంస్థలో మూడేళ్లుగా విస్తరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. సంస్థకు అవసరమైన భారీ యంత్రాన్ని భారీ వాహనం సాయంతో తెల్లవారి తీసుకువచ్చారు. అయితే యంత్రం వెడల్పు సుమారు 20 అడుగులపైగా ఉండడంతో తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో మల్కాపురం కల్యాణీ ఆస్పత్రి ఎదుట గల సేవా మార్గంపై తెల్లవారి చాలా సేపు భారీ వాహనం నిలిచిపోయింది. దీంతో ఆ సమయంలో విధులకు వెళ్లే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

దుర్గమ్మ ఆలయంలో పూజలు



మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ సెంటర్‌లోని దుర్గాదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 32వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో మల్కాపురం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, కానుకలు సమర్పించారు.ఈ సందర్భంగా నక్షత్ర హారతి ,కుంకుమార్చన వంటి పూజలు చేపట్టారు.మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.


ఘనంగా పరదేశమ్మ పండగ



ఆలయంలో కమిటీ సభ్యులతో దొడ్డి కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో పరదేశమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పసుపు కుంమలతో పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన పరసతో ఈ ప్రాంతం సందడిగా మారింది. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

విద్యార్థినుల యోగాభ్యాసం



యోగా చేస్తున్న సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థినులు

మల్కాపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల ఆవరణలో మంగళవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ గెసిల్లా, ప్రిన్సిపాల్ ప్రేమకుమారి తదితరులు పాల్గొని, యోగా వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ముంచెత్తగా..



కాలువలో నిలిచిన వ్యర్థాలు



సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం శివారు ప్రాంతం గ్రాంధీజీవీధి సమీపంలోని పెద్ద కాలువలో వ్యర్థాలు నిలిచిపోయాయి. దీంతో మురుగు పోయే దారి లేక వ్యర్థాలు సేవా మార్గంపైకి వచ్చాయి.దుర్వాసనకు చుట్టుపక్కల వాసులు ఇబ్బంది పడ్డారు. దీంతో వారంతా అక్కడకు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను వార్డు శానిటరీ సిబ్బందికి వివరించారు. వ్యర్థాలు పొంగి ఇబ్బంది పడుతున్నా స్పందించరా అంటూ కాలనీ వాసులు శానిటరీ సిబ్బందిపై మండిపడ్డారు.వ్యర్థాలు తొలగించే విధంగా చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో ఆ ప్రాంతానికి వచ్చిన స్థానిక నాయకుడు మజ్జి సోమేష్ బుధవారం వ్యర్థాలు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. – మల్కాపురం

ఘనంగా పైడిమాంబ జాతర



పైడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 54,57 వార్డులల పరిధిలో ఐటీఐ జంక్షన్, సంకురపేట ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ అమ్మవారి ప్రధాన జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాధ్యక్షులు, గ్రామ కమిటీ సభ్యుల ప్రత్యేక పూజలతో జాతర ప్రారంభం అయింది. ఈ సందర్భంగా భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీనివాస శర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. పూజారులు పిల్లి చంద్రశేఖర్, పిల్లి నాగమణి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీనగర్, గవర కంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశి కూడలి, దయానందనగర్, గోకుల్‌నగర్, ఐటీఐ కూడలి, తాటిచెట్లపాలెం, కరాసా, ఎన్‌ఏడీ, గోపాలపట్నం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. భక్తులు అమ్మవారి మూలవిరాట్‌తో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. ఘటాలను అమ్మవారి ఆలయం వద్దకు చేర్చారు. కోలాటాలు, తప్పిటగుళ్లు, చిడతలు, వివిధ నేలవేషాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. ఐదవ పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ వేడుకలను గ్రామ కమిటీ పాలక వర్గ సభ్యులు మురళి, రమణ, శంకర్, రాము, సూరిబాబు, రామకృష్ణ, నూకరాజు, జగదీష్, బాలు, శ్యామ్ తదితరులు పర్యవేక్షించారు.

బెల్ట్ షాపులపై దాడులు

- నలుగురిపై కేసులు నమోదు
- 25 మద్యం బాటిళ్లు స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..



ఇంట్లో మద్యం విక్రయిస్తున్న వారి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న బాటిళ్లు

మల్కాపురం: అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. రహస్యంగా వ్యాపారాలు సాగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సాక్షి దినపత్రికలో సోమవారం పారిశ్రామిక ప్రాంతంలో బెల్టు షాపుల దందా అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి సీఐ గొలగాని అప్పారావు స్పందించారు. మంగళవారం ఉదయం నాలుగు బృందాలుగా పోలీసులను ఏర్పాటు చేసి ఒకేసారి దాడులు చేశారు. 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసులు నమోదు చేశారు.అనంతరం మల్కాపురం సేవా మార్గంలో వైన్ షాపుల పక్కన రహస్యంగా మద్యం సేవించేందుకు ఉపయోగిస్తున్న గుడారాలను తొలగించారు.మల్కాపురం స్టేషన్ పరిధిలో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని పలువురిని హెచ్చరించారు.

అమ్మ సంబరం.. అదిరెన్

- అట్టహాసంగా మోదకొండమ్మ పండగ
- తరలివచ్చిన భక్తజనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు



పరసలో భక్తుల కోలాహలం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గోపాలపట్నం: మోద కొండమ్మ సంబరం అదిరింది. భక్తులు పోటెత్తారు. క్యూలో నిరీక్షించి మరీ అమ్మవారిని దర్శించుకున్నారు. జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం దరి ఇందిరానగర్‌లో మోద కొండమ్మ అమ్మవారి పండగను మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. గోపాలపట్నం పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి చీరలు గాజులు పసుపు కుంకుమలు సమర్పించారు.అమ్మవారికి పసుపు కుంకుమలతో అభిషేకాలు చేశారు.

పరసతో కిటకిటలాడిన రోడ్లు

మోదకొండమ్మ అమ్మవారి పండగ సందర్భంగా ఇందిరానగర్ ప్రధాన రహదారిలో పరస నిర్వహించారు. పరసకు వచ్చిన వారితో రోడ్లు కిటకిటలాడాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...

పండగ సందర్భంగా పలు వీధుల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను కట్టి పడేశాయి. డ్యాన్స్ కార్యక్రమాలు సంగీత విభావరి వంటివి ఆకట్టుకున్నాయి. కళాకారులు వేసిన డ్యాన్సులు కుర్రకారును ఉర్రూతలూగించాయి.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

మోద కొండమ్మ అమ్మవారిని ప్రభుత్వ విప్ గణబాబు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బెహరా భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లె అప్పలస్వామి నాయుడు, నారిపిన్ని సత్తిరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు కేవీ సుబ్రహ్మణ్యం, నానేపల్లి జయశంకర్, గండేపల్లి కనకకుమార్, ఉల్లూరి ప్రకాష్, బంగారు తులసి రామ్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి





పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం, పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మల్కాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మల్కాపురం సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, ప్లాస్టిక్ బదులు పేపర్ లేదా క్లాత్ బ్యాగ్‌లు వినియోగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద మొక్కలు నాటాలని కోరారు. తమ పిల్లల పుట్టిన రోజులు, వివిధ శుభకార్యాలలో పచ్చని మొక్కలను కానుకగా ఇవ్వటం, లేదా వాటిని నాటడం వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాఖ విద్య: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని సెంట్రల్ పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు పి. గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం మంగళవారం ఎన్‌ఏడీలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. సమావేశానికి హాజరైన గోపాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షనర్స్‌కు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు. వీటికి వ్యతిరేకంగా జూలై 9న దేశ వ్యాప్త సమ్మెకు అంతా సిద్ధంగా ఉండాలన్నారు. కనీస పెన్షన్ అమలు చేయాలనే డిమాండ్ ఉన్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ఖండించండి

పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో వామపక్ష పార్టీల పిలుపు



ర్యాలీలో పాల్గొన్న వామపక్ష నాయకులు

బీచ్‌రోడ్డు: పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ప్రజలు ఖండించాలని, పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలు ఆర్టీసీ కాంప్లెక్స్ దరి గురజాడ విగ్రహం దగ్గర నుంచి ఆశీలమెట్ట మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు యుద్ధం వద్దు.. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ఊచకోతలను ఖండించండని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను తీవ్రంగా ఖండించారు.

20 మాసాలకు పైగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని గుర్తు చేశారు. వీరిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని తెలిపారు. ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేశారన్నారు. అంతర్జాతీయ జలాల్లో ఫ్రీడమ్ ఫోటిల్లాకు చెందిన మాడ్‌లీన్‌ఓడపై ఇజ్రాయెల్ జరిపిన దాడిని కూడా వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. అదుపులోకి తీసుకున్న అంతర్జాతీయ వలంటీర్లందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో సామ్రాజ్యవాద మనుగడ కోసం అమెరికా అనేక దేశాల మధ్య యుద్ధాలు సృష్టించి ముందుకు సాగాలనుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు.

భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు. పాలస్తీనీయులపై ఇజ్రాయెల్ మారణకాండకు వ్యతిరేకంగా ప్రజలు నిలబడాలన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణలో సింహగిరి వర్తకులు, మారుతీ భక్తమండలి బృందం

సింహాచలం: చందనోత్సవం రోజు సింహగిరిపై గోడ కూలి శివైక్యం చెందిన భక్తుల పవిత్ర ఆత్మలకు శాంతి కలగాలని సింహగిరి వర్తక సంఘం ఆధ్వర్యంలో 51 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం జరిగింది. మెట్లమార్గాన్ని ఆనుకునే షాపింగ్ కాంప్లెక్స్ ఉండటంతో వర్తకులంతా జరిగిన సంఘటనను ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారు. దీంతో వారి ఆత్మలకు శాంతి చేకూరాలని వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మారుతీ భక్తమండలి బృందం 51 సార్లు హనుమాన్ చాలీసాని పఠించారు. ఈ సందర్భంగా ముగ్గు కిరణ్ మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ ఎగువన గోడ కూలి భక్తులు మృతిచెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వర్తక సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రాజు, వర్తకులు దొంతల శంకర్, నమ్మి శివ, చంద్రరావు, ఎస్.శివ, కె.సుజాత, శ్యామ్, అశోక్, పండూరి రమేష్ పాల్గొన్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలపై చర్చ



పూర్వ విద్యార్థుల సమావేశంలో వీసీ ఆచార్య రాజశేఖర్ తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది సంవత్సర వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం మంగళవారం ఏయూలో జరిగింది. ఈ సమావేశంలో ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్. ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎస్. కిషోర్ హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎం. రావు, బీవీఎస్. రావు వర్చువల్‌గా హాజరయ్యారు. వారు సంఘం భవిష్యత్తు దృక్పథం, కార్యకలాపాలపై వివరణాత్మక వివరణ ఇచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ ఉపకులపతి బీలా సత్యనారాయణ, ఏఏఏ మాజీ చైర్మన్ గంటా శ్రీనివాసరావు, శంకర్ సమావేశంలో పాల్గొని విలువైన సలహాలు ఇచ్చారు. వర్క్‌షాప్‌లో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం దార్శనికత, లక్ష్యం, విలువలను అధికారికంగా రూపొందించారు. పూర్వ విద్యార్థుల సంఘం కొత్తగా పునరుద్ధరించిన వెబ్‌సైట్‌ను అధికారికంగా ప్రారంభించారు. డిసెంబర్ 2025లో జరగనున్న వార్షిక పూర్వ విద్యార్థుల సమావేశం ప్రణాళిక అమలుపై కూడా చర్చించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అభిషేకాలు జరిపారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం



రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఉక్కునగరం: కేవీపీఎస్ స్టీల్ డివిజన్, ఏపీ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఎస్టీఎం విభాగం జీఎం ఎస్.రమణారావు, జనరల్ ఫోర్‌మెన్. కె. బాలశౌరిలను సత్కరించారు. గత నెలాఖరున పదవీ విరమణ చేసిన సందర్భంగా స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం వారికి శాలువాలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడానికి, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పని చేయాలని కోరారు. సన్మానగ్రహీతలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ తమకు ఎంతో మంచి భవిష్యత్తు ఇచ్చిందని, ప్లాంట్ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్ సుందరం, కేవీపీఎస్ అధ్యక్షుడు ప్రకాశ్ వరకుమార్, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. చిరంజీవి, వై.టి. దాస్, బి. తాడన్న, కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ విమల తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.